# సయించు గొడవ

నేనూ భద్రమూ కూచుని కాస్సేపు బీడీలు వెలిగించి ఒకళ్ళ మొహాన ఒకళ్ళం పొగూది తరవాత పుస్తకాల అమ్మకాలు చూడటం మొదలు పెట్టాం.

"భద్రం?"

"గురో?"

"మన 'ఆవుకు తోకుటుంది' ఎన్ని కాపీలు అమ్మిన్నె?"

"మూడేలు."

"వొండ్రుఫుల్ భద్రం, వొండ్రుఫుల్. మన 'స్ఫూర్తిక్‌యేట'కు యెవిజెంట్లంతా డబ్బుమీద చెక్కులు పంపారా?"

"పంపిస్తూ, పంపిస్తూ ఉన్నారు గురో. ప్రింటు రేపటితో ఎత్తేస్తారుట. పై పుస్తకం పేరు అట్టలోపల ఎయ్యటానికి రాసి పంపీమంటున్నాడు ప్రెస్సాయిన."

"అతోశ్మి, అతోశ్మి. కొత్తప్లాటే ఆలోచించలేదు, భద్రం!"

"అదెంతసేపు గురో! నాలుగు కులూలు ఆల్లేశామంటే ప్లాటు కుదిరిందన్నమాటే!"

నేను విచార నగిలో మునిగి అడుక్కుపోయాను. మా ఊరిపక్క బుడమేట్లోనన్నా ఈతలు కొట్టానుగాని, ఈ విచారనదిలో ఈదటం చాతగావటంలేదు.

"ఆరోజులే మంచివి. భద్రం" అన్నాను పెద్ద హూర్పులాగి.

"ఏ రోజులు గురో?"

"అప్పుడే మరిచావా? మెట్లమీద టకటక - సబ్బా, సూపరూ మనని ట్రంకు చెయ్యటం - నే నా డిటెక్టివు క్లబ్బు కెళ్ళినరోజు - హంతా ఏదో జనమల్లేవుంది. ఇప్పుడంతా క్లూలు పోగుచెయ్యటం. నువు గోకి పారెయ్యటం-! నిజమైన అంతకులేరి? హపరాద పరిశోధనేది?"

"ఇదే బాగుందిలే, గురో! మన సందుమలుపు బీడీకొట్టాయన అవుపించాడు. 'ఏందయ్యా చిత్తరం? మా మీద బొత్తిగా శీతకన్ను యేసినావే?' అన్నాడు. 'ఏంది కత?' అన్నా. 'మీ కేయాజుగారి పుత్తకం నాక్కూడా ఓటి ఇప్పియరాదెట్టా' అన్నాడు. 'ఏవిఁ స్తావూ?' అన్నా. 'అయిజ్జేసుకో.' అన్నాడు. 'పదికి తగ్గవేఁ!' అన్నా. బొత్తిగా బక్కాణ్ణయిపోతినే!

నిన్ననైతే ఇచ్చేపనేగాని, ఒక వెయ్యి బీడీలు కొనుక్కొచ్చా. డబ్బు తక్కువగా ఉండది అన్నాడు. నా అంతట నేనే ఒక ప్లాటేసి గీకి పారేద్దామా అనుకున్నా. కాని మళ్ళీ మీ పేరుకాస్తా పాడయిపోతుందని అనుమానించా!"

దీనికి ఏమనాలో ఆలోచించేటంతలో ఒక పెద్ద ఉరుము ఉరిమి మేఘం లోపలికి వచ్చింది. అంటే.. 'ఏవల్లుడోయ్!' అని కేక పెడుతూ కుంటుకుంటూ గవరయ మాఁవ వచ్చాడు.

"ఏ మాఁవా? నకబడి శాన్నాలాయె!" అన్నా.

"ఆప్లీడరింటి గోడమీదిగా గెంతటంలో కాలు కాస్త జవికిందిలే! అల్లుడా. ఆకుఱ్ఱ కొర్నా సెదవా నేను పదరా అన్నప్పుడు బయలుదేరక పడగ్గదిలోకి దూరాడు... పాపం, అడిగితేవయిందే! పిల్లనాయాళ్ళకు ఉబలాటవేగాని టయిఁవు గ్యానం తక్కువలే, అల్లుడా... ఏం చిద్రఁవయ్యా. ఎగస్ట్రా యాసాలేస్తుండావా? మీ పని వాటంలే" అన్నాడు గవరయ్య మావ చతికిలబడుతూ.

"ఏం వాటంలే, మాఁవా? పుస్తకాలేస్తున్నాంగా, మోత! మోతనుకో! పుస్తకం చెల్లగా పుస్తకం. పుస్తకం చెల్లగా పుస్తకం - ఇప్పటికి రెండు పుస్తకాలేశాం. చెరొక పదీ సంపాయించుకున్నాం" అన్నాడు భద్రం.

"హో-య్!" గవరయ్యమావ ఇల్లదిరేటట్టు నవ్వాడు. 'పదా!' అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"నువు నవ్వుతావుగాని, మాఁవా, పుస్తకం మూడేలు, నాగులేలు వారం లోపల పైసలా అయిపోతున్నదనుకో. అట్ట ప్రెస్సునించి కాపీలు తీసుకోవటం ఇట్ట కాటా యేసి అమ్మేయటం! శాంప్లీ కాపీ కూడా లేకుండా పోయిందంటే నమ్ము!" అన్నాడు భద్రం.

"మరి నీ డిటెక్స నేమాయె?" అన్నాడు గవరయ్యమావ నాకేసి మీసాలతో చూసి.

"తప్పు భద్రందే, మావా! అంతకుల్ని పట్టుకోవటం మనకు గిట్టుబాటు కాదన్నాడు."

"ఆయ్!"

"కేసులు పట్టమని మన నెవరన్నా పిలిస్తేనే అంతంత మాత్రమన్నాడు."

"ఆయ్!"

"ఒకేల అంతకుణ్ణి తరిమిపట్టినా వాణ్ణి ఏం చెయ్యాలో మనకు తెలవదన్నాడు."

"సూడో, అదే యెఱ్రిమాట. నువు అంతకుణ్ణి పట్టాలేగాని ఎంత డబ్బయినా రాల్తది. 'ఇదుగో, నిన్ను పోలిస్తే ఏవిస్తావ్?' అంటే ఆ యాలంపాటంతా ఆడే పాడేస్తాడుగా!... అయినా, సూడో! ఇప్పుడు నీ అంతకుడంటే ఏవిటనుకుంటుండావో, అల్లుడా! అంతా సవిన్సనుకో సవిన్సు!...

"అదెట్టా మావా!" అన్నాను హత్యాశ్చర్యంతో. ఈసయించు సంగతి నేనెప్పుడూ వినేలేదు.

"ఇదుగో సూడో! నేనే ఉండాననుకో. నన్ను డిటెక్టివు నా కొడుకును పట్టమనో!"

"పట్టలేదేం?"

"ఆ డబ్బుతరం గాదనుకో! అంతా సవిన్సు. నే నేంజేస్తానో తెలుసా? ఆడి యెనకాడితే ఓ మంద్రగబ్బనొదుల్తా. సూడో, ఆడు కారెక్కి నాకోసం అమరావతి కెల్లనీగాక ఆ మంద్రగబ్బ ఆ డెంటపడి ఆ డెక్కడాగితే అక్కడ లటుక్కున కాటేస్తది. దాంతో వాడు ఖాలీ!"

"అబ్బా!" అన్నా.

"అదెట్టాగని అడుగో! అది నిజమైన మంద్రగబ్బ అనుకుండావా వొట్టిది; ఒక చచ్చిన మంద్రగబ్బ తీసుకో. ఇంత సూదంటురాయి తీసుకుని మూడు పూటాలేసి బస్మం చెయ్యి. చచ్చిన మంద్రగబ్బకు దాన్ని పూసి డిటెక్టివు కారులో యెల్లేదారిలో వొదిలెయ్యి. కారులో యినువుంటది. సూడో అది ఆకర్సించనున్నూ, మంద్రగబ్బ అదేమైన కారెంబడి పరిగెత్తి డిటెక్టివు నా కొడుకును లటుక్కున కాటేస్తది. అయిందా?"

"ఆయ్!" అన్నాను హత్యాశ్చర్యంగా.

"డిటెక్టివుగాడు ఓ గదిలో కూకుంటాడా? ఆడి గది కప్పులో – అదేందీ? టెలిస్కోపా. రేడియోఫోనా? – అది పెట్టేస్తా. అదేంజేస్తదీ? ఆడు అనే మాటలన్నీ పోకసుజేసి గొట్టంలోంచి నా దగ్గిరికి పంపిస్తది! ఇంకేఁవుందీ! ఆడి ఆట కట్టే?"

"అబ్బా" అన్నాను మళ్ళీ.

"ఇప్పుడు సవిన్సు ఎక్కడ ఎవరు జెప్పుకున్నా మహాశెద్దగా యింటుండాలే అల్లుడా! సూడో, మనిషి చచ్చినాక అరగంట దాకా పేణం పోకుండా ఉండొచ్చుట. ఇంకేవుందీ? డిటెక్టివు నా కొడుకు సచ్చాడన్నమాటే. ఒకణ్ణి గుండేసి కొట్టి సంపేసి ఆడికి ఇంజకస నిచ్చేసి నాదారిన నేపోతా. గుండేసిన సప్పుడిన్న రిక్సావాడు గోడకింద డిటెక్టివుకోసం కనిపెట్టుకుని అట్టనే ఉంటడు. వాడి సేతిగడియారంలో సరిగా ఏడూ ఇరవై రెండు ముక్కాలయుంటది. ఆయ్? తరవాత ఏడూ ఇరవై ఆరుంగాలుకు నే నా పక్కసందుగా పోతుంటే చించెట్టుకింద నిలబడి సూసిన ఆకుపచ్చ సీరె మడిసి చించెట్టుక్రింద అట్టనే నిలబడి సేతిగడియారం సూసుకుని డిటెక్టి వెప్పుడొస్తడా అని చూస్తూంటది.

"రాత్రి తొమ్మిదిన్నరేల డిటెక్టివు పూటుగా కాపీతాగి, పూటుగా అమ్మాయిని వాటేసుకుని కేసు యిప్పటాని కొస్తడు. ఆయ్? ఇంకేం, గోడకింద రిక్సావాడు డిటెక్టివును సూత్తానే, 'ఏడూ ఇరవై రెండు ముక్కాలు!' అని చెప్పేసి టీ నీల్లక్కూడా డబ్బులడక్కుండా

రోజల్లా బాడిగలు పోగొట్టుకుని, గుడిసెకు రిక్సా యీడ్సుకుపోయి డొక్కలో కాల్లెట్టుకుని తొంగుంటడు. ఆయ్?

"చివర కేవవుద్ది? అమ్మాయి మారేసాలేసుకుని గుంటకల్లూ, సెదలవాడా అంతా తిరిగి ఏందేందో రాసుకొస్తుంది. డిటెక్టివు దాన్ని వాటేసుకుని ఆ రాసుకొచ్చిందంతా చదువుకుని, టెలిఫోనెత్తి ఇనస్పిటరుతో ఈ పనిచేసింది ఎల్లమందో ఆరుముగవో అని మీరు పొరపాటు పడుతున్నారల్లే ఉంది. ఇది గవరయమాద పనే అవటా అని చెప్పేస్తాడు. కాని ఏం లాభం? గవుర్మెంటు సరిజెనొచ్చి అత్యజరిగింది ఏడు యాభై రెండుంగాలు పని చెప్పేస్తాడు. ఏడుముప్పైకి ఎనిమిదికీ మద్దె గవరయ మావ ఎక్కడుండాడూ? అల్లుడితోనూ భద్రంతోనూ బాతాకానీ కొడతా ఉండాడు. ఇంకేం కేసూ? పైసలా! డిటెక్టివు ఖాలీ!... అన్నట్టు ఎనిమిది కొట్టిందా, అల్లుడా?"

గవరయమావ ఆ మాట అడుగుతుండగానే గడియారం ఎనిమిది కొట్టింది.

గవరయమాద లేచి నిలబడి, "యెల్లొస్తా, అల్లుడా! నాకోసం ఎవరన్నావస్తే అరగంట మించీ ఇక్కడే ఉండి, అట్ల గుడికేసి ఎల్లానని సెప్పో!" అంటూ కుంటు కుంటూ వెళ్ళిపోయాడు.

ఆలోచిస్తున్నాను, సయించు డిటెక్టివు.

"భద్రం? మనం ఇక రాస్తే సయించు కథలే రాయాలి!" అన్నాను.

భద్రం ఆలోచన ఎక్కడుందో మరి. హులిక్కిపడ్డట్టుగా "ఏంది, గురో?" అన్నాడు.

***ముద్రణ: కొడవటిగంటి కుటుంబరావు కథల సంపుటి, 1957***

***జయా పబ్లికేషన్స్, విజయవాడ***